రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.32 (సోమవారం సాయంత్రం)
సహర్ : 5.00 (మంగళవారం ఉదయం)
బిద్దత్ (చేయకూడని, నిషేధించబడిన పనులు) అనుసరించే వ్యక్తి ఆ బిద్దత్‌ను వదులుకొనే వరకు అతని మంచి పనులను అల్లాహ్ అంగీకరించడానికి నిరాకరిస్తాడు

ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల ఇష్టారాజ్యం

- రాత్రి వేళల్లో సర్వీస్ రోడ్ల వెంట వాహనాల పార్కింగ్
- చైన్ నెంబర్ 78, 79ల వద్ద ఎన్‌హెచ్‌ఏఐ బౌండరీల ఆక్రమణ
- సంగారెడ్డి, కామారెడ్డి సరిహద్దులో పోలీసుల అత్యుత్సాహం



7

యాంత్రీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా

- రైతులకు అందనున్న రాయితీ యంత్రాలు
- రైతులకు మరింత ప్రయోజనం
- గత ప్రభుత్వంలో అటకెక్కిన పథకం
- నియమ నిబంధనలు రావాల్సి ఉంది



7

కాలువను కబ్జా చేశారు

- కాలువలో ఇళ్ల నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- సాగు నీరు పారడం ఎలా?



7

ఇసుక నిల్వలపై.. అన్వేషణ!


మంజీరాలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

- జిల్లాలో నెలకొంటున్న ఇసుక కొరత
- అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లకు లభించని ఇసుక
- స్థానిక అవసరాల కోసం ఇసుక రీచ్‌లు గుర్తించాలంటూ ప్రభుత్వ ఆదేశాలు
- దీంతో ఏ వాగులో ఎంత ఇసుక ఉందో గుర్తించే పనిలో అధికారులు
- మంజీరాతో పాటు ఇతర వాగుల్లో ఇసుక మేటల కోసం ఆరా తీస్తున్నారు
- ప్రస్తుతం జిల్లాలో రెండు చోట్ల మాత్రమే తవ్వకాలు

కామారెడ్డి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంజీరానదితో పాటు ఇతర ప్రాంతాల్లోని వాగుల్లో ఇసుక తవ్వకాలు జరగకపోవడంతో కొరత ఎదురవుతోంది. కనీసం ప్రభుత్వ అభివృద్ధి పనులకు సైతం ఇసుక దొరకలేని పరిస్థితి. మంజీరాలో ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తరలించారనే ఆరోపణలతో సంవత్సరం కిందట తవ్వకాలను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో స్థానిక అవసరాలకు ఇసుక లభ్యం కావడం లేదు. అయితే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులకు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక తవ్వకాల కోసం ఎక్కడెక్కడ ఇసుక నిల్వలు ఉన్నాయో గుర్తించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో సంబంధిత శాఖాధికారులు ఇసుక నిల్వలపై ఆరా తీస్తున్నారు. మరోవైపు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేందుకు మంజీరాలో ఇసుక రీచ్‌లను గుర్తించాలని టీజీఎండీసీ సైతం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది.

ఇసుక నిల్వల కోసం సర్వే

ఇందిరమ్మ పథకం కింద జిల్లాలో నియోజక వర్గానికి 3500ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నమూనా ఇళ్ల నిర్మాణం కోసం అర్హులను గుర్తించి ఇళ్ల నిర్మాణాల కోసం శంకుస్థాపన చేశారు. ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇసుక నిల్వలు ఉండే వాగులు, వంకలను గుర్తించేందుకు రెవెన్యూ, నీటి పారుదల, భూగర్భ జలాల, మండల ప్రత్యేకాధికారులు సర్వే చేపడుతున్నారు. ఏ వాగులో ఎంతమేర ఇసుక నిల్వలు ఉన్నాయి. ఎంతమేర తవ్వచ్చు అనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. ఆయా వాగుల్లో ఇసుక తవ్వకాలు జరిపితే స్థానికంగా భూగర్భ జలాలకు ఏమైన ఇబ్బందులు తలెత్తుతాయా అనే దానిపై సర్వే చేస్తున్నారు. స్థానికంగా ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తే అక్రమంగా తరలకుండా పక్కదారి పట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో మంజీరా నదితో పాటు గౌలి లింగాల, కూడెల్లివాగు, పల్వంచవాగు, లింగంపేట పెద్దవాగు తదితర వాటిలో సర్వే చేపడుతున్నారు.

మంజీరాలో ఇసుక రీచ్‌ల కోసం కసరత్తు

జిల్లాలోని బీర్కూర్, బిచ్కుంద మండలాల పరిధిలో గల మంజీరా నదిలో ఉన్న ఇసుక రీచ్‌ల ద్వారా అనుమతులు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని టీజీఎండీసీ భావిస్తోంది. ఇందులో భాగంగా మంజీరా నదిలో ఇసుక తవ్వకాల కోసం రీచ్‌లను గుర్తించాలని జిల్లా భూగర్భ గనుల శాఖను నివేదిక కోరింది. ఇక్కడ ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తే వాణిజ్యంగా ఇసుక అమ్మకాలు చేపడితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని దీంతో పాటు జిల్లాలోని స్థానిక అవసరాలకు ఉపయోగపడుతుందని టీజీఎండీసీ భావిస్తోంది. గత ఏడాది నుంచి మంజీరానదిలో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. గత ప్రభుత్వంలో టీఎస్‌ఎండీసీ ద్వారా ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వడంతో అక్రమంగా ఇసుక తరలిపోయిందని దీంతో ప్రభుత్వానికి నష్టం వచ్చిందని ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక రీచ్‌లను మూసివేసింది. అయితే మరోసారి ఇసుక కొరత నెలకొంటుండడంతో రీచ్‌లకు అనుమతులు ఇవ్వాలని టీజీఎండీసీ భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రస్తుతం జిల్లాలో ఆ రెండు చోట్లే తవ్వకాలు

జిల్లాలో సంవత్సరం కిందట ఇసుక రీచ్‌లు మూసివేయడంతో కొన్ని రోజులుగా తవ్వకాలు నిలిచిపోయాయి. దీంతో ఇసుక కొరత ఏర్పడుతుంది. కనీసం స్థానికంగా ఇళ్ల నిర్మాణాల కోసం కాకుండా ప్రభుత్వ పనులకు ఇసుక దొరకడం లేదు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు మంజీరానదిలో మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో గతంలో సర్వే చేయించింది. బీర్కూర్ మండలంలోని చించోలి మంజీరాలో 55వేల క్యూబిక్ మీటర్లు, బిచ్కుంద మండలంలోని పుల్కల్ 91 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. స్థానిక అవసరాలు అభివృద్ధి పనుల కోసం ఈ రెండుచోట్ల ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. స్థానికంగా ఉన్న రెవెన్యూశాఖ అనుమతులతో ఈ రెండు చోట్ల ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వ పనుల పేరిట ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలోనే ఇసుక అక్రమంగా తరలుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

స్థానికంగా ఇసుక కొరత

జిల్లా మీదుగా ఉండే మంజీరా నదిలో ఇసుక మేటలు చాలానే ఉన్నప్పటికీ జిల్లా అవసరాలకు మాత్రం ఇసుక దొరకడం లేదు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు గాని నిర్మాణ రంగాలకు గాని ఇసుక లభించకపోవడంతో స్థానికంగా నిర్మాణరంగం కుదేలవుతోంది. జిల్లాలో ఇప్పుడు ఇసుకకు ఫుల్ డిమాండ్ నెలకొంటుంది. ట్రాక్టర్ ఇసుక తెప్పించుకోవడం కోసం వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. మంజీరాతో పాటు కూడెల్లి, గౌలిలింగాల, పల్వంచ, లింగంపేట పెద్దవాగుల నుంచి ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ప్రధానంగా మంజీరాలో ప్రభుత్వం గత ఏడాది కిందట రీచ్‌లను మూసివేసింది. కాళేశ్వరం వద్ద మాత్రమే పరిమితిలోపే తవ్వకాలకు అనుమతులు ఇస్తోంది. దీంతో ఇసుక తవ్వకాలు జరగక ఇసుకకు మార్కెట్‌లో కొరత ఏర్పడుతోంది. గతంలో మంజీరా నదిలో టీఎస్‌ఎండీసీ ద్వారానే తవ్వకాలు జరగడంతో ఇసుక అమ్మకాలు జరుగుతుండేవి కానీ ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరగడం లేదు. పొరుగు జిల్లాల నుంచి సైతం ఇసుక సరఫరా కాకపోవడంతో బ్లాక్‌లో ఇసుక కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.


నాగిరెడ్డిపేట బస్టాండ్‌కు బస్సు వెనుకే బస్సు వచ్చిన ఎలక్ట్రిక్ బస్సులు

సమయానికి గమ్యానికి చేర్చని బస్సులు

- సమయపాలన పాటించని ఆర్టీసీ అధికారులు
- నిజామాబాద్ నుంచి బాన్సువాడ, మెదక్, నర్సాపూర్ మీదుగా జేబీఎస్ వరకు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులు

నాగిరెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అధికారులు బస్సుల సమయపాలన సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల సమయానికి బస్సులు రాకపోగా, వస్తే ఒకదాని వెనుక ఒకటి బస్సులు వస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సెనక బస్సు వెళుతుండడంతో తిరిగి బస్సుల కోసం గంటల తరబడి ప్రయాణికులు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవలే ఆయా డిపోలకు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులు (ఈ ఎక్స్‌ప్రెస్ బస్సులు) వచ్చాయి. ఈ ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తుండడంతో ఈ ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నిజామాబాద్ 2 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులను గత కొన్ని రోజులుగా నిజామాబాద్ నుంచి బాన్సువాడ, మెదక్, నర్సాపూర్ మీదుగా జూబ్లీ బస్‌స్టేషన్ వరకు నడిపిస్తున్నారు. తిరుగు ప్రయాణంలోనూ జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి ఈ బస్సులు నర్సాపూర్, మెదక్, బాన్సువాడ మీదుగా నిజామాబాద్ వెళుతున్నాయి. అయితే ఈ బస్సుల రాకపోకల సమయం ప్రయాణికులకు సరిగ్గా తెలియడం లేదు. ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు వెళతాయో తెలియడం లేదని, బస్సులు వస్తే ఒకేసారి ఒక దాని వెనుక ఒకటి వస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం నిజామాబాద్ నుంచి జేబీఎస్ వెళ్తున్న ఎలక్ట్రిక్‌ఎక్స్‌ప్రెస్ బస్సులు నాగిరెడ్డిపేట బస్టాండ్‌కు ఒకదాని వెనుక ఒకటి రెండు బస్సులు ఒకేసారి చేరుకున్నాయి. రెండు బస్సులు ఇక్కడి నుంచి ఒకేసారి బయలుదేరి వెళ్లాయి. నిజామాబాద్ నుంచి బయలుదేరే ఈ ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులు జూబ్లీ బస్ స్టేషన్‌కు వెళ్లాక బస్సులకు చార్జింగ్ తగ్గిపోతుండడంతో జూబ్లీ బస్‌స్టేషన్‌లో తిరిగి ఈ బస్సులు ఛార్జ్ చేసుకున్నాక తిరిగి ఇవి జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి నిజామాబాద్‌కు బయలుదేరుతున్నాయి. చార్జి చేసుకున్నంత వరకు ఇవి జూబ్లీ బస్ స్టేషన్‌లోనే ఉండడంతో ఎప్పుడు చార్జి పూర్తవుతుందో? ఎప్పుడు ఈ బస్సులు బయలుదేరుతాయో తెలువడం లేదని ప్రయాణికులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు తగు చర్యలు తీసుకొని సమయానుసారంగా బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

- బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

బాన్సువాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీకి సంబంధించి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ప్రజలను కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటి పన్ను, వృత్తి వ్యాపార లైసెన్స్‌లు నల్లా బిల్లులు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణ పరిధిలో చాలా మంది పన్నులు చెల్లించవలసి ఉందన్నారు. ఇట్టి పన్నులు చెల్లించని వారిపై మున్సిపల్ చట్టంపై 2019 ప్రకారం తగు చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. అదే విధంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం రిబేట్ ఇచ్చే అవకాశం ఈనెల 31న ముగుస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పూజలు


తిరుపతిలో పూజ చేస్తున్న నితిన్‌గౌడ్

సదాశివనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ నితిన్‌గౌడ్ ఆదివారం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు తెలంగాణ ప్రభుత్వం మంత్రి పదవి ఇవ్వాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతంగా ఉన్నందున ఈ ప్రాంతానికి మంత్రి పదవి రావడం వల్ల అభివృద్ధి, నూతన అవకాశాలు తెచ్చిపడతాయని తెలిపారు.

యథేచ్ఛగా బెల్ట్ దందా

- జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు దుకాణాలు
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- పట్టణం, పల్లెలు అని తేడా లేకుండా ఏరులై పారుతున్న మద్యం
- కామారెడ్డి మున్సిపల్ పరిధిలో జోరుగా సాగుతున్న దందా
- బెల్ట్ దుకాణాల నివారణకు పోలీసుల ప్రత్యేక దృష్టి
- పలుచోట్ల తనిఖీల్లో పట్టుబడుతున్న మద్యం బాటిళ్లు


నర్సన్నపల్లి వద్ద గల ఓ బెల్ట్‌షాపులో పోలీసులు గుర్తించిన మద్యం బాటిళ్లు (ఫైల్)

కామారెడ్డి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టు దందా జోరుగా సాగుతోంది. గత కొన్నెళ్లుగా పల్లెలు, పట్టణాలని తేడా లేకుండా కిరాణదుకాణం నుంచి మొదలుకొని గృహాలు, పాన్‌షాప్‌లు, కల్లు కంపౌడ్‌ల వద్ద కల్తీ మద్యం ఏరులై పారుతోంది. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తు బెల్టు దందాను మూడు పువ్వులు ఆరు కాయాలుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపులా పరిసరాల్లో కొనసాగిన ఈ దందా దినదినాభివృద్ధి చెందుతూ గల్లీకోటి వెలుస్తుండడంతో మద్యం ప్రియులు ఉదయం టీకి బదులుగా మద్యంను తాగి ఎక్కడ పడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. ఇటీవల ఏఎస్‌పీ చైతన్యారెడ్డి బెల్ట్ దుకాణాల నివారణకు చర్యలు చేపట్టారు. దీంతో పోలీసులు నిత్యం ఏదో ఓ చోట దాడులు చేస్తుండడంతో ఈ దందా బట్టబయలవుతుంది. అయితే ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే ఏళ్లుగా ఈ దందా కొనసాగుతుందనే విమర్శలు లేకపోలేదు. కామారెడ్డి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఏ బెల్ట్‌షాపు ఎక్కడ కొనసాగుతుందోననే విషయం తెలుస్తోంది కానీ ఇక్కడ పనిచేసే అధికారులకు మాత్రం ఆ దుకాణాల జాడ తెలియకపోవడం విడ్డూరంగా ఉంది.

మద్యం మత్తులో గ్రామాలు

ఒక్కప్పుడు పట్టణ ప్రాంతాల్లోనే పరిమితమైన ఈ దందా. ప్రస్తుతం చాపకింద నీరులా గ్రామీణ ప్రాంతాల్లోకి పాకింది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేయడం చూస్తుంటేనే తెలుస్తోంది మద్యంకు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు బానిసలుగా మారి ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారనేది. జిల్లాలో పరిధిలో దాదాపు 4 వేలకు పైగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని సమాచారం. బెల్టుదుకాణాల్లో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.20 నుంచి 30 వరకు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. గత రెండు రోజుల కిందట హోలీ సందర్భంగా మద్యం షాపులు మూసివేయడంతో మద్యం ప్రియులకు ఈ బెల్ట్‌షాపులే దిక్కయ్యాయి. రోజు మాదిరిగా కాకుండా రూ.50 నుంచి 100 వరకు ఎక్కువ ధరకు అమ్మకాలు జరిపారనే వాదనలు లేకపోలేదు. పైగా కొన్ని మండలాల్లో పోలీసులు చేసిన తనిఖీల్లో మద్యం బాటిళ్ల పదుల సంఖ్యలో పట్టుబడుతుండడం చూస్తేనే ఏ స్థాయిలో దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

మద్యం షాపుల వారే కమీషన్లకు అమ్మకాలు

బెల్టు దుకాణాలు పల్లె, పట్టణ ప్రజలకు మత్తులో ముంచెత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్న చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలో కొందరు మద్యంషాపుల వారే కమీషన్లకు బెల్టు షాపుల నిర్వహణ చేయిస్తున్నారని సమాచారం. రోజుకు ఎంత అమ్మితే అంత కమిషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిరాహకులు ఒక్కరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దందా బహిరంగంగా కొనసాగిస్తు ప్రజలను మత్తులో ముంచుతున్నారని ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు.

కామారెడ్డి పరిధిలో జోరుగా సాగుతున్న దందా

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఈ దందా జోరుగా సాగుతోంది. ఓల్డ్ కామారెడ్డిలో దాదాపు పదుల సంఖ్యలోనే నేరుగా ఇంట్లో, కిరాణ దుకాణాల్లో అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం. కిరాణ దుకాణాల్లో కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలుస్తోంది. కామారెడ్డి రూరల్ పరిధిలోనూ ఈ దందా ఎక్కువగానే సాగుతోంది. ఇటీవల నర్సన్నపల్లి వద్ద ఓ బెల్ట్ దుకాణం సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యం సీజ్ చేశారు. టెక్రియాల్‌ను గత మూడు రోజుల కిందట పోలీసులు దాడులు చేసి మద్యం పట్టుకున్నారు. మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేటలో పోలీసులు పదుల సంఖ్యలో మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఇలా జిల్లాలోని అనేక మండలాల్లో ఈ దందా సాగుతోంది.

నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు

జిల్లాలో ఈ దందా సంగతి తెలిసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఎవ్వైన ఫిర్యాదురాగానే బెల్టు నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అప్రమత్తం అవుతున్న వారు తనిఖీలలో ఏమి దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో ఈ బెల్టుదందాపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే బెల్టుదందాకు అడ్డుపడడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఒకే దేశం ఒకే ఎన్నిక అమలైతే దేశానికి లాభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం ఒకే ఎన్నిక అమలైతే దేశానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకుంటున్న సంస్కరణలో మరో చారిత్రాత్మకైన నిర్ణయం వన్ నేషన్ వన్ ఎలక్షన్ అన్నారు. దేశంలో సుమారు 65రాజకీయ పార్టీలు జమిలీఎన్నికలు జరపా లని ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, కంచెట్టి గంగాధర్, రాంచందర్, నాగొళ్ల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం ముదిరాజ్ సంఘం పెద్దల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. వేధాంతం గోపికృష్ణశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణాల మధ్య గణపతి పూజ, గౌరిపూజ, అమ్మవారి పూజ, అమ్మవారి ప్రతిష్ఠాపనకు యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ గజం మచ్చేంధర్, పెద్దబజార్ సంఘం అధ్యక్షుడు బోండ్ల సంతోష్, రాజారాంనగర్ సంఘ అధ్యక్షుడు ఈర్ల రవి, చైర్మన్ బోన సుమన్, జక్కం ప్రసాద్, బోండ్ల ఆనంద్, మందుల బాలు, ముదిరాజ్ సంఘ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

● ఒకరు మృతి, పలువురికి గాయాలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్‌టౌన్‌మార్చి16(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణం వద్ద 44వ జాతీయరహదారిపై శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరగడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు నిషాద్, మనిష్, కర్నాల్ భీమ్‌గల్ మండల కేంద్రంలో తమ పనిని ముగించుకొని నిర్మల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వారి వెనుక నుంచి వచ్చిన కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ముగ్గురులోని ఒకరు నిషాద్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే బైక్‌ను ఢీకొన్న కారు ముందు అగి వున్న కంటై నర్‌ను ఢీకొనడంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ హెచ్‌వో సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకోవడంతో సంఘ టన స్థలాన్ని పరిశీలించారు. గాయాలైన నలుగురిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

హంగర్గలో ద్విచక్ర వాహనం చోరీ



చోరీకి గురైన ద్విచక్ర వాహనం

కోటగిరి,మార్చి16(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలోని బీసీ కాలనీలో గంగాధర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. తన కిరాణ షాపు ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని దొంగలించారు. వాహనం కోసం పలు ప్రాంతాలలో వెతికిన దొరకకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు

నవీపేట,మార్చి16(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని శివాజీనగర్ కాలనీకి చెందిన బుయ్యని వంశీకృష్ణ అనే యువకుడు ఆదివారం యంచ గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతుండగా పోలీసులు అతనిని కాపాడారు. కుటుంబ తగదాలతో మధ్యాహ్నం సమయంలో యంచ గోదావరి బ్రిడ్జి మీద నడుచుకుంటూ వెళ్తా నదిలో దూకడానికి యత్నించాడు ఇదే సమయంలో ఎస్‌ఐ వినయ్ బాసర వైపు వెళ్తుండగా అతనిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందులో హెడ్‌కానిస్టేబుల్ పరశురాం ఉన్నారు. తన కుమారుడి ప్రాణాలు కాపాడి తమకు అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి కరాటేలో వెల్కటూర్ విద్యార్థులు

మెండోర, మార్చి16(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటేలో వెల్కటూర్ ఓపాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్‌పాషా సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన మూడో జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో 26మంది విద్యార్థులు పాల్గొన్నారు. కటాస్ విభాగంలో అండర్ -12 విభాగంలో 12 బంగారు పతకాలు, ఐదు కాంస్య పతకాలు సాధించారు. అండర్-10 విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించారు. అండర్-8 విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు. పలు విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర జెకెఎస్ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఎండి.పాషా, స్టేట్ జాయింట్ సెక్రెటరీ పసునూరి అవినాష్, నిజామాబాద్ జిల్లా చీఫ్ ఇన్‌స్పెక్టర్ జోగు శివాణి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసపత్రాలు అందజేశారు. పలు విభాగాల్లో బంగారు పతకాలు విద్యార్థులు సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



నగరంలో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నందిపేటలో..



ఆర్మూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మల దహనం

నిజామాబాద్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):అసెంబ్లీలో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో జిల్లా కాంగ్రెస్, నగరకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలను దహనం చేశారు.అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో పాటు ఆ వ్యాఖ్యలను సమర్థించిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా కేసీఆర్ దళితులను, గిరిజనులను అవమానించేలా వ్యవహరించారని ప్రస్తుతం అసెంబ్లీలో కేటీఆర్ బరితెగించి తన ఎమ్మెల్యేలతో కలిసి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. మునుముందు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తప్పకుండా గుణపాఠం చెబుతామని దళితులు, గిరిజనులు మీ అంతు చూస్తారని అన్నారు. గత 14 నెలలుగా అధికారం పోయిన తర్వాత కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు అందరిని అవమానించేలా ఉన్నా యని ఇది దొర అహంకారానికి నిదర్శనమన్నారు.ఈకార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి,నాయకులు రత్నాకర్, రాంభూపాల్, రామర్తిగోపి, వేణురాజ్, కేతావత్ యాదగిరి,శ్రీనివాస్,వినయ్, ఉషా, విజయలక్ష్మి, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై మోస్రా మండల కేంద్రంలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను మండల కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. స్పీకర్‌పై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు తోటరాజు, సీనియర్ నాయకులు హరినారాయణ,చింతకుంట మాజీసర్పంచ్ విమల లింగయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంగం సాయిలు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గుండు శ్రీకాంత్, బీసీసెల్ జిల్లాకార్యదర్శి అశోక్,తిమ్మాపూర్ నానుసాయిలు, బాలయ్య, రాములు, సాయిలు, నర్సయ్య, మోహన్, చింటు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం మాజీమంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై మాజీమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. జగదీష్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, కాంగ్రెస్ నాయకులు రాజు, ఏజాజ్ ఖాన్, దత్తు, మన్సూర్, చాంద్ పాషా, నబీ, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రూరులో కేటీఆర్, జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం

కోటగిరి: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీమంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండల కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం మాజీమంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేకపోతున్నారని అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు కళ్లు తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, నారోజి గంగారాం, అరుణ్ కుమార్, పార్వతి ప్రవీణ్, సంజీవ రెడ్డి, సంగయ్య, అశోక్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: మండల కేంద్రంలోని జాతీయరహదారిపై ఆదివారం మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. గత గురువారం అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఏకవచనంతో సభ నీ సొంతం కాదు మాట్లాడి అగౌరపరిచిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం జాతీయరహదారిపై దిష్టిబొమ్మను దహనం చేశారు. మొదటి నుంచి కేసీఆర్ పార్టీ విధానమే బలహీనవర్గాలను అవమానపరుస్తూనే ఉన్నారని, దళిత, బహుజనులు అంటే ఇంత అసహనం ఎందుకని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జగదీశ్వర్‌రెడ్డికి శాసనసభను, స్పీకర్ స్థానాన్ని గౌరవించడం తెలియదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి పాత వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అడ్వాల మనోజ్, గడ్డం అనిల్, ఎఎంసీ డైరెక్టర్‌లు మహిపాల్, లక్మరంజిత్, నవీద్, గిర్మాజీగోపి, చిన్న గంగారాం, ఆనంద్, హర్షద్‌లు పాల్గొన్నారు.

ముప్కాల్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి, అతనిని సమర్థించిన కేటీఆర్ దిష్టిబొమ్మను ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై వ్యతిరేక నినాధాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, కొమ్ముల శ్రీనివాస్, ముస్కు ముత్తెన్న, విజయ్, రాములు, ప్రతాప్, శ్రీకాంత్, మహేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మాజీమంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇటీవల దళిత నాయకుల పట్ల బీఆర్‌ఎస్ వైఖరిని వారు ఖండించారు. అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి ఏకవచనంతో మాట్లాడి సభ మర్యాద మంట కలిపారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నాయకుల పట్ల అగౌరవంగా మాట్లాడితే సహించేదిలేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు లింగాగౌడ్, అయ్యప్ప శ్రీనివాస్, వాసు, జిమ్మి రవి, ఫయిాం, కొక్కెర భూమన్న, లింబాద్రి, బబ్లు, నారాయణ, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా దిష్టిబొమ్మలు దహనం చేశారు.



ముప్కాల్‌లో..



మోర్తాడ్‌లో ..



మాక్లూర్‌లో..

ప్రతిపక్ష నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిలు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఏఎంసీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు తదితరులు ఉన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆర్మూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ అశోక్, నాయకులు వినోద్, పరశురాం, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న నూర్జహాన్

ఖిల్లా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ ఆశావర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం 18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటియు జిల్లా కార్యాలయంలో ఆశావర్కర్లతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశావర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పొందుపర్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆశావర్కర్ల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆశావర్కర్ల సమస్యలు మాత్రం నేటికి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సుఖన్య, రేణుక, స్వప్న, రాధా, శోభ, గంగామణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఏర్గట్లలో ఇఫ్తార్ విందులో ముస్లింలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్గట్ల మండల కేంద్రంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు హాజరై మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ళుగా ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నామని, రంజాన్ ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లిమార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, కౌడ పెద్ద భూమేష్, జింక అనిల్, బెజ్జారపు భాను, మండలంలో కాంగ్రెస్ నాయకులు, మైనార్టీలు పాల్గొన్నారు.

దేశ సైనికుల గ్రామం అడవి మామిడిపల్లి

● ఆర్మీలో చేరి దేశసేవ చేస్తున్న యువకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): సరిహద్దు సేవంటే సాహసమే. దేశ భద్రత నా బాధ్యత అంటు దేశరక్షణలో పాలుపంచుకుంటున్నారు అడవి మామిడిపల్లి యువకులు బార్డర్‌లో సైనికులుగా ఉంటూ భారత్‌కు రక్షణగా నిలుస్తూ దేశభక్తిని నిరుపించుకుంటున్నారు. మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లి నిజామాబాద్, ఆర్మూర్ మార్గంలోని 63వ జాతీయరహదారిపై ఉంది. ఆ గ్రామ యువకులు ఇంటర్ పూర్తి కాగానే దేశరక్షణకు నడుం బిగించి ఆర్మీలో చేరుతున్నారు.

తెలుగులో విస్తృతంగా సాహిత్య సృజన జరగాలి

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సుభాష్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మన తెలుగు భాషా మనకు గర్వకారణం అని తెలంగాణ భాషను ముందు తరాలకు అందించడం ధ్యేయం కావాలని ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ భాషలో రాసే కవితలు కథలతో మనుగడలోలేని తెలంగాణ పదాలు సామెతలు నుడికా రాలు వెలుగులోకి వచ్చి తెలంగాణ అస్తిత్వం ఘనంగా నిలబడుతుందని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నా తెలంగాణ భాషలో కవితలు, కథలు రాసేవారికి ఇది గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమాన్ని తలపెట్టిన హరిదా రచయితల సంఘాన్ని అభి నందించారు. ఉత్తమ కవితలు, కథలను పంపించి కవులు, రచయితలు పోటీని విజయవంతం చేయాలన్నారు. అనంతరం హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ భాషలో కవితలు, కథలు రాసి మే 30వ తేదీలోపు హరిదా సరస్వతీరాజ్ ఎట్‌దిరేట్‌జి మెయిల్‌కు పంపాలని మిగతా వివరాల కోసం 9948032705 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిదారచయితల సంఘం అధికార ప్రతినిధి నరాల సుధాకర్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, రామ్‌స్మృతిక, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమ్‌గల్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేంగాల్ గ్రామంలో ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పలు బాధిత కుటుంబలను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు వసంత్‌రెడ్డి వాళ్ల నాన్న ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. సంగెం శారద ఇటీవల మరణించారు. వారి కుటుంబాలను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి:ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినిన కమ్మర్‌పల్లికి చెందిన అనిల్‌ను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ప్రమాద వివరాలతో పాటు, ఆరోగ్య స్థితిని బాధితుడు అనిల్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు అజ్మత్ పాష, అజహారోద్దీన్. స్థానికులు అజయ్ తదితులు ఉన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలోని పాలెం, దొన్‌పాల్ గ్రామాలలో బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. పాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సారెడ్డివారి అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుం బాన్ని ఆదివారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన టీచర్ రాజేం దర్ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబసభ్యులను కూడా సునీల్ కుమార్ పరామర్శించారు. దొన్‌పాల్ గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి మృతురాలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేంగల్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

షాపూర్‌లో తపోవన ఆశ్రమం ప్రారంభం



షాపూర్‌లో మహరాజ్‌లకు పాదపూజ చేస్తున్న గ్రామస్థులు

నందిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షాపూర్ గ్రామంలో ఆదివారం తపోవన ఆశ్రమాన్ని వివిధ ఆశ్రమాలకు చెందిన మహరాజు ప్రారంభించారు. ముందుగా శివానంద భారతీ స్వామిచే ప్రణవ పతావిష్కరణ, శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బాద్గుణ గంగారెడ్డి, ఫతేపూర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో గీతా పారాయణం, విష్ణు సహస్ర నామం, శ్రీరామ రక్ష స్తోత్రములు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మేశ్వర్ బాలానంద స్వామి, ప్రకాశం జిల్లాలోని సింగరకొండ శాంతానంద మాతాజీ, కలిగోట శభరి మాత ఆశ్రమం బ్రహ్మానంద మహరాజ్, వేల్పూర్ నారద ఆశ్రమ దశరత మహరాజ్, డొంకేశ్వర్ సదానంద మహరాజ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆకుల లలిత ఫౌండేషన్ ద్వారా ఉద్యోగాలు



అభ్యర్థులతో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత

నిజామాబాద్‌అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ ఫౌండేషన్ ద్వారా ఈ నెల 12న నిర్వహించిన ఎన్‌ఎంసీ కంపెనీ జాబ్ మేళాలో ఇంటర్వ్యూ ద్వారా ఎంపికైన యువతీ యువకులకు ఆదివారం హైదరాబాద్‌కు పంపించారు. మొత్తం 98 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 42 మందికి మొదటి విడతగా ఫాక్స్ కాన్సే కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా యువతీ యువకులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె స్వయంగా యువతీ యువకులను బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

టీయూకి ఈశ్వరీబాయి పేరు పెట్టడం హర్షనీయం



వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

ఖిల్లామార్చి 16(ఆంధ్రజ్యోతి):తెలంగాణా విశ్వవిద్యాలయానికి ఈశ్వరీబాయి పేరు ప్రకటించడం హర్షనీయమని సీనియర్ దళిత నాయకులు, సామాజిక ఉద్యమకర్త బంగారుసాయిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్ర తెలియని కొందరు విశ్వవిద్యాలయానికి ఈశ్వరీబాయి పేరు పెట్టడాన్ని వ్యతిరేకించడం వారి అజ్ఞానాన్ని సూచిస్తుందని ఆయన మండిపడ్డారు. సామాన్య దళిత కుటుంబంలో పుట్టిన ఈశ్వరీబాయి అంచెలంచేలుగా ఎదిగి దళిత జాతిని చైతన్యపర్చిన గొప్ప మహ్మాతురాలని అన్నారు. తెలంగాణా ఉద్యమకారునిగా అసెంబ్లీని గడగడలాడించిన ఆదిశక్తి ఈశ్వరీబాయి అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు ప్రతినిధులు సక్కి. విజయ్‌కు మార్, కేష్‌పల్లి రవి, చంద్రశేఖర్, సంతోష్, రత్నాకర్, రమేష్, పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

మాదక ద్రవ్యాలకు యువత బానిస కావద్దు

● యాదగిరి గౌడ్, మోపాల్ ఎస్సై



ఆంధ్రజ్యోతి: గ్రామీణ యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: గ్రామీణ యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండేందుకు గ్రామీణ యువకులకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు తాగడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వారికి వివరిస్తున్నాం. వీటికి బానిస కాకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు చేపడుతున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి?

ఎస్సై: పోలీస్ స్టేషన్ పరిధిలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయా?

ఎస్సై: అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కాని కొన్ని గ్రామాల్లో సరిగ్గా నడవడం లేదు.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? పోలీస్ స్టేషన్‌లో సరిపడా సిబ్బంది ఉన్నారా?

ఎస్సై: దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో విస్తృతంగా పెట్రోలింగ్ జరుపుతున్నాం. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేకున్నా అన్ని గ్రామాల్లో పెట్రోలింగ్‌ను చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వాహనాల తనిఖీ చేపడుతున్నారా? మద్యం సేవించి నడిపే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: వాహనాల తనిఖీలు వారంలో రెండు లేదా మూడు రోజులు నిర్వహిస్తున్నాం. మద్యం నడిపి వాహనం నడిపితే వారిపై చర్యలు కూడా తీసుకుంటున్నాం. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో మొరం, ఇసుక దందా జోరుగా నడుస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు?

ఎస్సై: మండలంలో మొరం, ఇసుక దందా జరుగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంటున్నాం. ఎవరైనా మొరం, ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఈ రెండింటి దానిపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని కొన్ని గ్రామాల్లో జూదం నడుస్తున్నట్లు సమాచారం?

ఎస్సై: మండలంలో జూదం నడవకుండా చర్యలు తీసుకుంటున్నాం. తమకు తెలియకుండా ఎవరైనా జూదం ఆడినట్లు తెలిస్తే వారిపై దాడి చేసి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అనేక మందిపై కేసులు కూడా పెట్టడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్ల చేతిలో గ్రామీణ ప్రజలు మోసపోతున్నారు వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ ఆవరణలో సదస్సులను ఏర్పాటు చేసి సైబర్ నేరగాలు చేస్తున్న మోసాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారి చేతిల్లో ఎవరూ మోసపోవద్దని కోరారు. అటువంటి వారు ఎవరైనా ఫోన్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలి.

● (మోపాల్, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో భగీరథ నీరు కలుషితం

● పట్టించుకోని అధికారులు



జాన్కంపేట్ మిషన్ భగీరథ నుంచి సరఫరా అవుతున్న కలుషితమవుతున్న నీరు

వేల్పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్‌తో పాటు పలు గ్రామాల్లో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ ద్వారా కలుషిత తాగునీరు సరఫరా కావడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి కలుషిత నీరు వస్తున్నప్పటికీ భగీరథ అధికారులు, సిబ్బంది తమకేమి పట్టనట్టుగా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కలుషిత నీళ్ల తాగితే తాము అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్‌లో ఎక్కడో ఒక చోట లీకేజీలు కావడం వల్లనే నీళ్ల కలుషితమవుతున్నాయంటున్నారు. అంతేగాకుండా మిషన్ భగీరథ ప్రాజెక్టు వద్ద నీటిని ఫిల్టర్ చేయడం కూడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రతీరోజు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు, పసుపు, గోధుమ రంగులో రావడం వల్ల ఆ నీరు తాగడానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి కలుషితం కాకుండా చర్యలు తీసుకొని మంచి నీరు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారి ఇదే



సర్వీస్ రోడ్డులో రాత్రుల్లో వాహనం నిలిపిన దృశ్యం



కుడి పక్కన ఉన్న దాబాకు విశాలంగా ఇన్ అవుట్ రహదారులు ఇచ్చిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎన్‌హెచ్ఏఐ

అధికారుల ఇష్టారాజ్యం



ఆరేడు బస్టాండ్ ఇదే

● రాత్రి వేళల్లో సర్వీస్ రోడ్ల వెంట వాహనాల పార్కింగ్ ● చైన్ నెంబర్ 78, 79ల వద్ద ఎన్‌హెచ్ఏఐ బౌండరీల ఆక్రమణ
● సంగారెడ్డి, కామారెడ్డి సరిహద్దులో పోలీసుల అత్యుత్సాహం ● ఈ రహదారి అంటేనే భయం భయం

నిజాంసాగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 161 జాతీయ రహదారి అంటేనే వాహనదారులకు ప్రజలకు భయం పుట్టుకొస్తుంది. దీంతో ఎన్ఏహెచ్ఏఐ అధికారులు పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ రహదారి వెంట బస్టాండ్‌లో సర్వీసు రోడ్లలో వాహనదారులు రాత్రి వేళలో ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతూ ఉండడంతో రహదారి వెంట వెళ్లే వాహనదారులు ద్విచక్ర వాహనాలు అనేక పాట్లు పడుతున్నారు. కానీ ఎన్‌హెచ్ఏఐ అధికారులు పోలీసులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా సరిహద్దులోని నిజాంసాగర్ మండలం ఆరేడు బస్ స్టేషన్ సమీపంలో ఇరుపక్కల గుజరాత్, హర్యానా దాబాలు వెలిసాయి. ఎన్‌హెచ్ఏఐ అధికారులు 161 రహదారి బౌండరీలను 2017లోని గుర్తించి ఆ రహదారి నిర్మాణం చేపట్టారు. చైన్ నెంబర్ 78, 79లో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం ఆరేడు బస్టాండ్లను ఏర్పాటు చేశారు. ఈ బస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారికి ఎదురు ఎదురుగా రెండేసి దాబాలు ఏర్పాటు చేశారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఆరేడు బస్టాప్ వద్ద ఉన్న ఇరుపక్కల ఉన్న దాబా యజమానులతో అధికారులు, పోలీసులు కుమ్మక్కై. ఎడమ పక్కన ఉన్న దాబాకు రెండు చోట్ల ఇన్, అవుట్ ప్రవేశాలకు రోడ్డును వదిలారు. ఇదే బస్టాండ్ కుడి వైపు మరో దాబా ఉండడంతో కేవలం ఒకేచోట ఇన్.. అవుట్‌గా రహదారిని ఇవ్వడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. 79 వద్ద ఓ ప్రైవేట్ వైద్యుడు బౌండరీ లోపల కార్ పార్కింగ్ చేసుకున్న ఎన్ఎన్ఏఐ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నిజాంసాగర్ మండలం ఆరేడు బస్టాప్ వద్ద రాత్రి వేళలో భారీ వాహనాలు నిలుపుతూ ఉన్న పోలీసులు ఎన్హెచ్ఈఏ అధికారులు పట్టించుకోకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్న పట్టించుకునే నాథుడే కరువ య్యారు. ఈ బస్ స్టేషన్ వద్ద ఉన్న లాభాలు ఎన్ హెచ్ ఏఐ రహదారి నిర్మాణం అనంతరం వెలసిల్లాయి. ఈ దాబా యజమానులు దారిని వదలాలని విన్న వించినప్పటికీ ఎన్ హెచ్ ఏఐ అధికారులు అప్పట్లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని తెలిసింది. 161వ రహదారి వెంటనే నరసింగరావుపల్లి కూడలి వద్దకు ఉన్న బ్రాహ్మణపల్లి, నర్సింగరావుపల్లి, మహాదేవుపల్లి, ఆరేడు బస్ స్టేషన్ల వద్ద వాహనాలను ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట, మంగళూరు గ్రామాలకు వెళ్లే రహదారులున్నా ప్పటికీ ఎన్ని అధికారులు యూ టర్న్ ఏర్పాటు చేయలేక పోయారు. దీంతో ఈ గ్రామాలకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు ఎన్‌హెచ్ఏఐ మొబైల్ బృందం రహ దారి వెంట పర్యవేక్షిస్తూ ఉన్న అక్రమ కబ్జాలు బస్‌స్టేషన్ల వద్ద రాత్రి వేళలో పార్కింగ్‌లు కనబడటం లేదా అని పలువు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి జుక్కల్ నియోజకవర్గం ఉన్నా రహదారి నరకయాతంగా మారింది. జుక్కల్ నియోజక వర్గం ఉన్న రహదారి సరిహద్దులను కబ్జా చేసుకుంటూ ఉన్న మొ బైల్ టీం సిబ్బంది చూసి చూడనట్లుగా వివరిస్తున్నారు. బస్‌స్టేషన్ వద్దనే దాబాలు ఉన్న రెండు జిల్లాల పోలీసులు పట్టింపులేని వ్యవహ రిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి ఈ బస్ స్టేషన్ల వద్ద పార్కింగ్ చేసే వాహనాలపై చర్య తీసుకోవడంతో పాటు ఆరేడు బస్టాప్ వెనకాల ఉన్న దాబాలకు ఇష్టారాజ్యంగా రహదారులు ఇవ్వడంతో దాబాల యజమాని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు, ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు

కాలువను కబ్జా చేశారు!

● కాలువలో ఇంటి నిర్మాణం
● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
● సాగు నీరు పారేదెలా..!?



జర దేఖో!!

కాలువలో ఇంటి నిర్మాణం

మోపాల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేసినా పట్టించుకునేవారు కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఓ వ్యక్తి వ్యవసాయ సాగునీరు కాలువను దర్జాగా కబ్జాచేసి ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ కాలువ పారకం ద్వారానే అనేక మంది రైతులు వ్యవ సాయం చేసుకుంటూ గడుపుతున్నారు. సిర్పూర్ గ్రామం నుంచి మోపాల్‌కు వెళ్లే ప్రధాన దారిలో కాలువ పక్కనే ఇళ్ల నిర్మాణం చేస్తున్నాడు. ఈ విషయం పలువురు రైతులు అడ్డుకున్నా తాను అధికారుల అనుమతితోనే ఇళ్ల నిర్మాణం చేస్తున్నానని తనను అడ్డుకునేది లేదని ఎదురు సమాధానం ఇస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఈ కాలువ ఉందని గ్రామ రైతులు పేర్కొన్నారు. ఈ కాలువ ద్వారానే సుమారు 150 ఎకరాలకు పంట సాగునీరు అందుతుందని తెలిపారు. సిర్పూర్ పెద్ద చెరువు రామన్న చెరువుల నుంచి ఈ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇక్కడి నుంచే న్యాల్‌కల్ గ్రామంలో ఉన్న పల్లెకుంట చెరువుకు కూడా నీరు పోతుందని తెలిపారు. కాలువలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం పనులను ఆపాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు గ్రామ రైతులు విన్నవించుకున్న ప్రయోజనం లేదని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువ ద్వారానే తమ తాతల కాలం నుంచి పంటలను పండించుకుంటూ వస్తున్నామని వివరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే కాలువ అంతా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామ రైతులు పేర్కొన్నారు. అనేక మంది రైతులు ఈ కాలువ ద్వారా వచ్చే సాగునీటిపై ఆధార పడే రైతులు ఉన్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పనులను ఆపక పోతే రైతులకు సాగునీరు ఎలా వస్తుందో ప్రత్యమ్నాయ మార్గాన్ని చూపాలని రైతులు కోరుతున్నారు.



మెండోరలో మల్లన్నస్వామికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

వైభవంగా మల్లన్న స్వామి జాతర

మెండోర, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మల్లన్నస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మల్లన్నస్వామికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకొని, కుటుంబ సభ్యులతో కలిసి మల్లన్నస్వామికి నైవేద్యం సమర్పించారు. స్వామివారిని మొక్కులు చెల్లించుకునే భక్తులు చిన్న పిల్లలను బంగారంతో కాటవేశారు. సాయంత్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామ ఆలయం నుంచి బోనాలతో గుట్టకు చేరుకొని స్వామివారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓంకారేశ్వరస్వామి వార్షికోత్సవ వేడుకలు

కామారెడ్డిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గల ఓం కారేశ్వరస్వామి ఆలయ మూడోవార్షికోత్సవం వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో మంగళచరణం, గంగాపూజ, గౌరిపూజ, మహాగణపతి పూజ, స్వామి, అమ్మవార్లకు పరిమళోధక మహాన్నపనం, రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భిక్కనూరు సిద్ధగిరి సదాశివమహంత్ శివాచార్య స్వామిజీ ఆలయంలో దీపారాధన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ ఆవరణలో 20 మంది జంటలతో లోక కల్యాణార్థం హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ధర్మశాల నుంచి పాత బస్టాండ్, పంచముఖి హనుమాన్‌కాలనీ మదుగా జయశంకర్ కాలనీలోని ఆలయం వరకు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో 100మంది మహిళలు కలశాల ఉరేగింపు చేపట్టారు.



పట్టణంలో కలశాలను ఊరేగిస్తున్న మహిళలు

వ్యవసాయ యాంత్రికీకరణకు

ప్రభుత్వం పచ్చజెండా



ట్రాక్టర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు

● రైతులకు అందనున్న రాయితీ యంత్రాలు ● రైతులకు మరింత ప్రయోజనం

ఆర్మూర్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీ కరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుంది. గత డిసెంబర్ నుంచి రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, ఉపకరణాలు, యంత్రాలు రాయితీపై సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నాలుగు నెలలు ఆలస్యం అయినప్పటికీ వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. గత ప్రభుత్వ పాలనలో ఆరేళ్ల పాటు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. వ్యవసాయ యాంత్రికీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కల్టివేటర్‌లు, నాగళ్లు, రోటోవేటర్‌లు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్‌లు, ట్రాక్టర్‌లు, మొక్కజొన్న మొలిచే యంత్రాలు, కిసాన్ డ్రోన్‌లతో పాటు ఇతర పరికరాలను అందజేయనున్నట్లు తెలిసింది.

● గత ప్రభుత్వంలో అటకెక్కిన పథకం..

అన్ని రంగాలలో మార్పులు వచ్చిన విధంగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో రైతులకు సబ్సిడీపై గతంలో అనేక పరికరాలు, యంత్రాలు అందజేసేవారు. దీంతో రైతులు ఎంతో సంతోషించారు. ఆ సంతోషం కాస్త మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ రంగానికి మంచి రోజులు వచ్చాయని రైతులు మురిసిపోయారు. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందజేయడం లేదు. 2018 మార్చి నుంచి రాయితీపై వ్యవసాయ పరికరాలు రైతులకు అందలేదు. 2025 మార్చి నెల నుంచి ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. సబ్సిడీపై యంత్రాలు అందజేస్తే వ్యవసాయంలో రైతులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, తక్కువ సమయంలో పనులు పూర్తి అవ్వడమే గాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. గతంతో వ్యవసాయానికి సబ్సిడీ యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. 2018 సంవత్సరం వరకు సబ్సిడీ కొనసాగింది.

● నియమ నిబంధనలు రావాల్సి ఉంది..

వ్యవసాయ యాంత్రికీకరణకు జిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.25కోట్లు తనవంతు వాటగా కలిపి రాష్ట్రంలో యంత్రలక్ష్మీ కార్యక్రమం చేపట్టాల్సి ఉంటుంది. మార్చి 31 ఆర్థిక సంవత్సం ముగిసేలోగా వ్యవసాయ యంత్రీకరణ పథకం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ పథకానికి సంబంధించి నియమ నిబంధనలు పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వస్తేగాని పథకానికి అర్హులయ్యేందుకు ఎంత భూమి ఉండాలి, ఎవరికి ఎంత ఇవ్వాలి అన్నది నిర్ణయించాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పథకం ప్రారంభించని పక్షంలో కేంద్రం నిధులు వెనక్కిపోయే అస్కారం ఉందని తెలుస్తోంది.

● వ్యవసాయ యాంత్రికీకరణ వెంటనే ప్రారంభించాలి

వ్యవసాయ యాంత్రికీకరణ పథకంలో భాగంగా సబ్సిడీపై రైతులకు అందజేసే వ్యవసాయ పరికరాలు, పరికరాలను వెంటనే అందజేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

● కూలీల కొరతను అధిగమించవచ్చు

వ్యవసాయ పనుల్లో యంత్రాలు వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే వీలుంటుంది. విత్తనాలు వేయడం మొదలు నుంచి పంట కోత వరకు అన్ని పనులు యంత్రాల వల్ల చేయడంతో సమయం ఆదా అవుతుంది. అంతేగాక కూలీల కొరతను అధిగమించవచ్చు. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే రైతులు యంత్రీకరణపై ఆధారపడి ఉన్నారు. వరి పంటకు చేతికొచ్చే సమయంలో కూలీలు లభించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరి కోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారమవుతుంది. వరి కోత యంత్రాలు అద్దెకు తీసుకొని పనులు వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం యంత్ర పరికరాలు, వరి కొత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతుల ఇబ్బందులు దూరమవుతాయి.

● అందుబాటులో లేని వరినాటు యంత్రాలు

రైతులకు వరినాట్లు వేసే యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామాల్లో సైతం పొలం పనులకు కూలీలు లభించక వరినాట్లు వేసే పనులకు ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే ఆసరా అవుతున్నారు. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబేంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలచే రైతులు నాట్లు వేయిస్తున్నారు. వరినాటు యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది.

● రైతులకు పెట్టుబడి ఆదాకు అవకాశం

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందజేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి డబ్బులు ఆదా అవుతాయి. రోటోవేటర్ లాంటి పరికరాల వినియోగంతో భూమి గుల్లాగా మారి సారవంతమవుతుంది. పిచికారి పరికరాలు (స్ప్రే) పంపులు రాయితీ ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. సీడ్‌కం ఫర్టిలైజర్, డ్రీల్ వినియోగం ద్వారా విత్తనమోతాదు, ఎరువులు మోతాదు ఆదా అయి రైతులకు బహువిధ లాభాలు చేకూరుతాయి. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించి రైతులకు నికర ఆదాయం పెంచడానికి వీలు కలుగుతుంది.





యంత్ర పరికరాలు

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నసురుల్లాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మతల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

బాలుడి మృతదేహం లభ్యం


నిజాంసాగర్ కాలువలో సిద్దార్థ మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

బాన్సువాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం జక్కల్ దాని తండా శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి శనివారం గల్లంతయిన బాలుని మృతదేహం లభ్యమైంది. హన్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని సంగ్రామ్ తండాకు చెందిన బోడసిద్దార్థ (16) స్నేహితుడు రాజుతో కలిసి సాగర్ కాలువలో ప్రమాదశాత్తు పడిపోయాడు. ఉపాధి కూలీలు రాజుని కాపాడగా సిద్దార్థను కాపాడలేకపోయారు. గజ ఈత గాళ్ళతో గాలించినా లభ్యం కాలేదు. గల్లంతైన ప్రాంతం నుంచి వంద మీటర్ల దూరంలో ఆదివారం ఉదయం మృతదేహం లభించింది.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణ

బీర్కూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళితవాడలో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మూడు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఇదిలా ఉండగా ఆదివారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ బీర్కూర్‌కు వచ్చి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన ఆర్థికసహాయం అందిందా లేదా అని ఆరా తీశారు. తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. అనంతరం కిష్టాపూర్‌కు చేరుకున్నారు. ఇటీవల నవీన్ అనే కార్యకర్త తండ్రి మృతిచెందడంతో అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ మేరకు యెండల లక్ష్మీనారాయణ బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకుందాం'


ముదిరాజ్ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

నిజాంసాగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకుందామని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం నిజాంసాగర్ మండల కేంద్రంలో ఆదివారం డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్, ముదిరాజ్ ఉద్యోగుల సంఘం 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమర జీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఆర్య వైశ్యసంఘం, వాసవీక్లబ్ తరఫున ఆదివారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్పు తగదని ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌గుప్తా, రీజినల్ చైర్మన్ మోటూరిశ్రీకాంత్, పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మొగిలిపల్లి భూమేష్‌గుప్తా, కూరశ్రీనివాస్, భాస్కర్‌గుప్తా, యాదఅంజయ్య, విశ్వం గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, నారాయణగుప్తా పాల్గొన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నెలనెలా జీతాలు చెల్లించాలి'

కామారెడ్డిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు నెలనెల జీతాలు చెల్లించాలని జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం ప్రత్యేక సలహాదారుడు లింగం అన్నారు. ప్రతి గ్రామాల్లో కూలీలను పనికి తీసుకుని వెళ్లి వాళ్లకు గిట్టుబాటు కొలతలు ఇచ్చి పని చేయిస్తున్నామని తెలిపారు. తమకు మూడునెలలుగా జీతాలు పెండిం గ్‌లో ఉన్నాయని వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. చాలీచాలని వేత నాలతోనే జీవనం సాగిస్తుండగా ప్రస్తుతం ఆ జీతాలు సైతం నెలనెలకు రావడం లేదని అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు తమ సమస్యలపై దృష్టిసారించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

సాహితీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ వి.శంకర్

కామారెడ్డిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణానికి చెందిన కవి, రచయిత, అధ్యాపకుడు డాక్టర్ వి.శంకర్ బూర్గులరంగనాథరావు రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణలో తెలుగు సాహితీ రంగానికి ఆయనచేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించినట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య పేర్కొంటూ ఆహ్వానం పంపినట్లు అధ్యాపకుడు శంకర్ తెలిపారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు


మద్నూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


బీర్కూర్‌లో

బాన్సువాడటౌన్ , మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : దళితులంటే బీఆర్ఎస్ నాయకులకు అంత అలుసా అని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ మండిపడ్డారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్వల కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి , నార్ల సురేశ్ , ఖాలేక్ , హజారే శంకర్ కార్యకర్తలు తదితరులున్నారు.

తాడ్వాయి : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి శౌకత్ అలీ, ఉపాధ్యక్షులు రాజీవ్ కుమార్, శివాజీ, లక్ష్మణ్ చారి, సమన్వయ కమిటీ సభ్యులు అంబీర్ శ్యామ్ రావు, మహేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సంజీవులు, తాడ్వాయి వైడిసి అధ్యక్షులు మేకల రాజు, మండల యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మనోహర్ దేశాయ్, తుకారం, బాలు, చందు, దేవిదాస్, బండి గోపి, కొండ గంగాధర్ పాల్గొన్నారు.

బీర్కూర్ : మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎంఎల్ఏ జగదీశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీశ్వర్ రెడ్డి శాసన సభా సభ్యత్వాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్త కాపు కాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బొయిని శంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు, సానెపు గంగారాం, మండల ఉపాధ్యక్షుడు గొండ్ల శీను, మాజీ ఎంపీపీ రఘు, మాజీ ఎంపీటీసీ సందీప్, మాజీ కోఆప్షన్ ఆరిఫ్, నాయకులు గొండ్ల రాజు, శశికాంత్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ శ్రేణుల నిరసన

కామారెడ్డిటౌన్ : దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ వద్ద ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, కేటీఆర్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు పుట్నాల శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ అంజద్, కాళ్లగణేష్, నర్సింలునాయకులు షేర్, ప్రసాద్, మహేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ :దళితులు అంటే టీఆర్ఎస్‌కు చిన్న చూపు అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భిక్కనూరు : కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో ఆదివారం కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ స్పీకర్ పట్ల అనుచిత వాఖ్యలు చేసిన జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేనియెడల తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రామారెడ్డి : కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి దిష్టి బొమ్మలను రామారెడ్డి మండల కేంద్రంలో దహనం చేశారు. కామారెడ్డి - భీంగల్ రోడ్డుపై రామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై కూర్చుని బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగుళ్ళ ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో వింఢో వైస్‌చైర్మన్ అమ్ముల పశుపతి, ఏఎంసీ డైరెక్టర్ ఎండి.రావుఫ్, యూత్ అధ్యక్షులు పిప్పరి గణేష్, మండల కో - ఆర్డినేటర్ రంగు రవీందర్ గౌడ్, మండల నాయకులు అంబాయి ప్రసాద్, బీపేట నర్సింలు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ :మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్ మాటాడుతూ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మారుతి, నాయకులు అక్కలి సాయిరెడ్డి, మల్లప్ప పటేల్, పండరి, సంజీవ్, ఇందిరాబాయి, బస్వరాజ్‌దేశాయ్, సంతోష్ దేశాయ్, రషీద్, జిన్న రాములు, విఠల్, యూత్ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగంపేట : మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు నిరసన తెలుపుతూ కేటీఆర్ ఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీఖ్, మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, ప్రసాద్‌గౌడ్, ఏదుల్, నగేష్, శ్రీనివాస్, అశోక్, రవి, గంగారెడ్డి, లతో పాటు నాయకులు ఉన్నారు.

నల్ల బ్యాడ్జిలతో నిరసన

ఎల్లారెడ్డి : అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనసభలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి దళిత స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించడం సరియైనది కాదని, వారి వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ తమ ఉనికిని కోల్పోతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్య నారాయణ, నాయకులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట : మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్ రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. జగదీశ్ రెడ్డిల దిష్టిబొమ్మ దహనం చేశారు.


లింగంపేటలో


భిక్కనూర్‌లో..

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● జుక్కల్ ఎమ్మెల్యే


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే

మద్నూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం మద్నూర్ మండల కేంద్రాలలో మహాత్మా గాంధీ జాతీయ ఆగ్రీమీణ ఉపాధి పథకం నిధులతో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని అనంతరం సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో 50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. జుక్కల్ నియోజకవర్గాన్ని విద్యా, వైద్యపరంగా మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న మద్నూర్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మద్నూర్ మండలానికి అరుదైన అవకాశం దక్కిందని అన్నారు. ఈ క్రమంలోనే సదరు పాఠశాల భవనానికి ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు వివరించారు. దీంతో ఈ ప్రాంతం పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో కార్పొరేట్ విద్య అందుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు,చ మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, నాయకులు సాయి పటేల్, హన్మాండ్లు, స్వామి, రామ్‌పటేల్, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ తదితరులు ఉన్నారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన పట్టాదారులు


మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన పట్టాదారులు

కామారెడ్డిటౌన్,మార్చి 16 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని రాజీవ్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ విషయంలో కృషి చేశారని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియను ఆదివారం పట్టాదారులు కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కొన్నేళ్లుగా డబుల్ బెడ్‌రూంలో ఉంటున్న లబ్దిదారులకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ విషయాన్ని గడ్డం ఇందుప్రియ దృష్టికి తీసుకురాగా కలెక్టర్, ఇన్‌చార్జ్‌మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి తెలుపడంతో వారి సహకారంతో డబుల్‌బెడ్‌రూం లబ్దిదారులకు పట్టాలు ఇప్పించేలా కృషిచేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో డబుల్‌బెడ్‌రూం కమిటీ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు షాన్‌వాస్‌ఖాన్, మహిళా కమిటీ మెంబర్‌లు పాల్గొన్నారు.

ఆర్యసమాజ్ వజ్రోత్సవ వేడుకలు

రామారెడ్డి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున ఆర్య సమాజ్ 75వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విట్టల్ రావు ఆర్య, హరికిషన్ ఆర్యా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హోమం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 75వ ఆర్య సమాజ్ స్థాపన దినోత్సవం సందర్భంగా మహర్షి దయానంద సరస్వతి 21వ జయంతి పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

నలుగురి రిమాండ్

దోమకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దోమకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేసిన కేసులో నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు దోమకొండ పోలీసులు ఆదివారం తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా దోమకొండకు చెందిన చింతల రవీందర్, మన్నే శ్యామ్‌రెడ్డి, మంగళపల్లి శ్రావణ్, కామారెడ్డికి చెందిన దొంతుల క్రిష్ణాలను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఈత వనం దగ్ధం


ఈత వనాన్ని పరిశీలిస్తున్న గౌడసంఘం సభ్యులు

దోమకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి):దోమకొండ గ్రామ శివారులోని ముత్యంపేట రోడ్డులో గల రెండు వాగుల మధ్యలోని ఈత వనంలో సుమారు 3వేలకు పైగా ఈత చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు గౌడ సంఘ సభ్యులు ఆదివారం తెలిపారు. అక్కడ 5 వేల ఈత మొక్కలు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక అబ్కారీ సీఐ మధుసూదన్‌రావుతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పరికరాలు మొకు, ముస్తాదు, గొడ్డలి, నిచ్చెనలు, ఉలి, లొట్లు, ఇతర వస్తువులు కాలిపోయాయని అన్నారు. సుమారు రూ. 4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సభ్యులు తెలిపారు.

దిశ కమిటీ మెంబర్‌గా పోగుల కవిత



దోమకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా దిశ కమిటీ మెంబర్‌గా దోమకొండ మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన పోగుల కవిత నియామకమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కమిటీ మెబర్‌గా నియామకం అయ్యేందుకు కృషిచేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కార్‌లకి కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పండరిని పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే

భిక్కనూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కుమ్మరి పండరీ తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల డిచ్చార్జ్ అయ్యాడు. విషయం తెలుసుకున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్దన్ పండరిని పరామర్శి ఆయన క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న అర్చకుడు

భిక్కనూరు, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో దక్షిణ కాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరా మేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదబ్రా హ్మణుల మంత్రోచ్చరణల మధ్య అగ్ని ప్రతిష్ఠహోమము, ధ్వజారోహణ, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం డప్పుచప్పుళ్ల నడుమ అలంకరించిన బండ్లను ఆలయం చుట్టూ ఊరేగింపు, రాత్రి ఆలయ ప్రాంగణంలో వీరభద్ర ప్రస్తావన, అగ్నిగుండాలు నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

బీర్కూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు డ్యాన్సులు, నృత్యాలు చేశారు. వారి ఆట పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. పదవ తరగతి పరీక్షలు సమీపించడంతో పదవ తరగతి విద్యార్థులకు తోటి విద్యార్థులు వీడ్కోలు పార్టీని ఇచ్చారు. విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో వెం కన్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం సబ్సిడీ

లింగంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్లాట్‌లు కొనుగోలు చేసిన వారు ఈనెల 31లోపు ఎల్ఆర్ఎస్ చేసుకుంటే ప్రభుత్వం 25 శాతం సబ్సిడీ ఇస్తుందని ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెరువులో పడి ఒకరి మృతి

జుక్కల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగుల్ల గ్రామానికి చెందిన ప్రకాష్ (35) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్ఐ భువనేశ్వర్ తెలిపారు. హోలీపండుగ రోజు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని అనంతరం గుల్లగ్రామం పక్కన చెరువులో ప్రకాష్ స్నానానికి వెళ్లగా నీటిలో మునిగి మృతిచెందాడని తెలిపారు. మృతుని తల్లి చంద్రభాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాధితులకు పరామర్శ

రామారెడ్డి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బాధిత కుటుంబసభ్యులను పలువురు నాయకులు పరామర్శించారు. మోషంపూర్ గ్రామానికి చెందిన నాయకులు దత్తాత్రేయ తండ్రి, ఉప్పల్‌వాయి మాజీ ఎంపీటీసీ ఉమా దేవి మామలు ఇటీవల మరణించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డిలు వారిని పరామర్శించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - కింగ్‌స్టన్
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - చావా

బాన్సువాడ

మహేశ్వరి - మజాకా
వెంకటేశ్వర - దిల్‌రూబా

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

